క్లుప్తంగా

క్రికెట్ విజేత బూదూరు



జట్టుకు కప్ అందజేస్తున్న మురళీమోహన్ రెడ్డి

కోసిగి: మండలంలోని తుంబిగనూరు గ్రామంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని ఎమ్మెల్యే వై. బాల నాగిరెడ్డి సహకారంతో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో బూదూరు జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం బూదురు, తంబిగనూరు జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నిర్ణీత ఓవర్లలలో బూదూరు జట్టు 120 పరుగులు చేయగా తుంబిగనూరు జట్టు 70 పరుగులకే ఆల్‌అవుట్ అయ్యింది. విజేతకు ఎమ్మెల్యే తరఫున వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి రూ.30వేలు, తుంబిగనూరు జట్టుకు రూ.20వేలు నగదుతో పాటు కప్ అందజేశారు. సర్పంచ్ వారం ఈరన్న, మెహబూబ్, దేవమణి పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ అందజేత



హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఇస్మాయిల్‌కు పింఛన్ అందజేస్తున్న వలంటీరు బ్రహ్మయ్య

పెద్దకడబూరు : మండలంలోని చిన్నతుంబళం గ్రామానికి చెందిన ఇస్మాయిల్ అనారోగ్యంతో గత 40 రోజులకు పైగా హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ కారణంగా గత నెల పింఛన్ కూడా తీసుకోలేదు. విషయం తెలుసుకున్న గ్రామం వలంటీర్ బ్రహ్మయ్య మంగళవారం అక్కడికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశాడు. దీంతో లబ్ధిదారుడి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

శివలింగ ప్రతిష్ఠాపన పూజలు



శివలింగ ప్రతిష్ఠాపన పూజలు చేస్తున్న పండితుడు

ఆదోనిఅర్బన్: పట్టణశివారులోని ఎల్లమ్మ కొండకు వెళ్లే దారిలో వెలిసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో శివలింగం ప్రతిష్ఠాపన పూజ లు మంగళవారం ప్రారంభమయ్యాయి. భక్తుల ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమైన ప్రతిష్ఠాపన పూజలు మహాశివరాత్రి వరకు కొనసాగనున్నాయి. ఈ మేరకు పండితుడు శివలింగ ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మినరసింహస్వామికి పంచామృతాభిషేకం, గంధం అలంకరణ, మహామంగళ హారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హనుమాన్‌కు ప్రత్యేక పూజలు

ఆదోనిఅర్బన్: పట్టణశివారులోని రణమండల కొండలో వెలిసిన ఆంజనేయస్వామికి మాఘ మాసం తుది మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. కార్తీకమాసం నిత్య ప్రసాదసేవా సమితి ఆధ్వర్యంలో స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, సింధూరసేవ, తులసి, వడలహారం, ఆకుపూజ, ప్రత్యేక పూల అలంకరణ, మహామంగళహారతి పూజలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను సభ్యులు పంచి పెట్టారు.

తిరోగమనంలో పురపాలక విద్యావ్యవస్థ

ఆదోని సెంట్రల్: పురపాలక విద్యావ్యవస్థ తిరోగమనంలో పడిందని ఎంటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ వాపోయారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. పురపాలక విద్యా వ్యవస్థలో 14 ఏళ్ల నుంచి ఒక్క ఉపాధ్యాయ పోస్టు కూడా మంజూరు చేయలేదన్నారు. రాయలసీమలో తగిన సంఖ్యలో పురపాలక పాఠశాలలు లేవని, ఉన్నవాటిలో ప్రభుత్వ నిబంధనలు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పోస్టులను మంజూరు చేసి సిబ్బందిని నియమించాలన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో వేల సంఖ్యలో పోస్టులు మంజూరు చేసి, బదిలీలు, పదోన్నతులు నిర్వహించిన విద్యాశాఖ పురపాలక ఉపాధ్యాయులపై మాత్రం కనికరం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధి వేతనాలు చెల్లించండి

ఆదోనిరూరల్: ఉపాధి పెండింగ్ బిల్లులు చెల్లించాలని, కరువు మండలాలకు 50 రోజుల అదనపు పనిదినాలు వెంటనే కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.నారాయణ, అధ్యక్షులు వీరశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉపాధి వేతనాలు చెల్లించడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. దీంతో స్థానికంగా పనులు లేక వ్యవసాయ కూలీలు, రైతులు వలసలు వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. అనంతరం ఏఓకు వినతి పత్రం అందజేసేందుకు పిలవగా నిర్లక్ష్యంగా ఉండడంతో సబ్‌కలెక్టర్ కార్యాలయంలోకి వెళ్లి సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. కార్యాలయం తలుపులకు వినతి పత్రాన్ని అతికించారు. నాయకులు దస్తగిరి, శ్రీరాములు, సురేంద్ర, రంగనాథ్, బాషా పాల్గొన్నారు.

బైచిగేరిలో అభివృద్ధి పరుగులు

- వైఎస్సార్‌సీపీ పాలనలో ఊపందుకున్న అభివృద్ధి
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత
- రూ.6 కోట్లకుపైగా అభివృద్ధి పనులు, రూ.13 కోట్లకు పైగా సంక్షేమ పథకాలు
- గ్రామంలో 70 శాతం అభివృద్ధి పనుల పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



వీరసింగ్ ఇంటి నుంచి మారెమ్మవ్వ ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణం



బైచిగేరి బీసీ కాలనీలో నిర్మించిన డ్రైనేజీ

ఆదోనిరూరల్: గత టీడీపీ హయాంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉండేది. దీంతో గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజలు అన్నిరకాలుగా ఇబ్బందులు పడ్డారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధి ఊపందుకుంది. ఆదోని మండలానికి 10 కి.మీ దూరంలో ఉన్న పంచాయతీ బైచిగేరి. వైఎస్సార్‌సీపీ పాలనలో ఇక్కడ అభివృద్ధి పరుగులు తీస్తోంది. సీసీ రోడ్లు, మురుగు కాలువలు, మంచినీటి కుళాయి కనెక్షన్లు, విద్యుత్ స్తంభాలు, శ్మశాన వాటికకు రోడ్లు, దేవాలయాలకు రోడ్లు, రైతుభరోసా కేంద్రాలు, సచివాలయ కేంద్రాల నిర్మాణాలు వంటి వాటిని నాలుగున్నర సంవత్సరాల్లో 70 శాతం పూర్తయ్యాయి. రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు, రూ.13 కోట్లతో సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కింది. దీంతో బైచిగేరి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనుల వివరాలు

- గుండమ్మ దేవాలయం నుంచి భీమన్న ఇంటివరకు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు వేశారు.
- మేలిగేరి లింగన్న ఇంటి నుంచి శ్మశాన వాటిక వరకు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు.
- వీరసింగ్ ఇంటి నుంచి మారెమ్మవ్వ దేవాలయం వరకు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పూర్తి చేశారు.
- జగనన్న కాలనీకి రూ.10 లక్షలతో తాగునీటి పైపులైన్ వేశారు.
- బైచిగేరిలోని బీసీ కాలనీలో రూ.10 లక్షలతో మురుగు కాలువ ఏర్పాటు చేశారు.
- రూ.40 లక్షలతో సచివాలయ నిర్మాణం పనులు చేపట్టారు.
- రూ.35 లక్షలతో రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.



శ్మశాన వాటిక వరకు ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు



గుండమ్మ ఆలయం నుంచి నిర్మించిన సీసీ రోడ్డు.



జగనన్న కాలనీకి తాగునీటి పైపులైన్ ఏర్పాటు

ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) మొత్తం : 13,12,10,609

పథకం	లబ్ధిదారులు	మంజూరు (రూ.లలో)
జగనన్న అమ్మ ఒడి	352	1,61,44,184
వైఎస్సార్ వసతి దీవెన	102	13,58,591
వైఎస్సార్ పింఛన్ కానుక	435	4,33,10,500
వైఎస్సార్ రైతు భరోసా	521	2,25,78,150
వైఎస్సార్ ఉచిత పంటలబీమా	334	34,17,760
వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు	133	3,74,861
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	1	2100
వైఎస్సార్ పెన్షన్ కానుక	435	4,33,10,500
వైఎస్సార్ చేయూత	223	1,05,18,750
వైఎస్సార్ ఆసరా	462	1,18,04,645
వైఎస్సార్ సున్నా వడ్డీ	56	26,34,206
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	12	3,30,000
వైఎస్సార్ కళ్యాణమస్తు/షాదీతోఫా	1	50,000
డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	167	44,34,482
డా.వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	105	5,97,250
హౌసింగ్ (లబ్ధిదారులకు నేరుగా చెల్లింపులు)	105	70,51,107
వైఎస్సార్ బీమా	9	13,60,000
వైఎస్సార్ వాహనమిత్ర	42	12,50,000
జగనన్న చేదోడు	29	5,80,000
వైట్‌కార్డు హోల్డర్లకు ప్రత్యేక కోవిడ్‌సాయం	810	8,10,000
జగనన్న తోడు (వడ్డీ)	39	13,889
పరోక్ష నగదు బదిలీ (నాన్ డీబీటీ) మొత్తం		రూ.6,05,27,995
పథకం పేరు	లబ్ధిదారులు	మంజూరైన (రూ.లలో)
ఇళ్ల స్థలాలు	111	2,73,06,000
జగన్న విద్యాకానుక	341	24,21,782
విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ	28	3,70,216
జగనన్న గోరుముద్ద	344	34,08,711
జగనన్న తోడు (రుణాలు)	69	12,84,711
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	293	54,87,890
ఇంటింటికీ రేషన్	927	2,02,49,388
డీబీటీ+నాన్ డీబీటీ మొత్తం		రూ.19,17,38,604

ఇబ్బందులు తొలగాయి



మా కాలనీలో గతంలో సీసీ రోడ్లు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాం. మురుగునీరు, వర్షపునీరు రోడ్లపైనే నిల్వ ఉండేది. దీంతో దోమలు వ్యాప్తి చెంది దుర్వాసన వెదజల్లుతుండేది. ప్రస్తుతం సీసీ రోడ్డు వేయడంతో కాలనీ ఎంతో శుభ్రంగా ఉంది. ఇబ్బందులు తొలగిపోయాయి.

– హరిజన యేసన్న, బైచిగేరి గ్రామస్తుడు

నాణ్యతగా పనులు చేపట్టాం



గ్రామంలో రూ.4 కోట్లకు పైగా ఖర్చు చేసి అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టాం. సీసీ రోడ్లు, మురుగు కాలువలు, పైపులైన్ పనులు, సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. పనుల్లో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నాణ్యతే ప్రామాణికంగా తీసుకొని పనులు పూర్తి చేశాం. మిగతా 30 శాతం పనులను వేగంగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. చేసిన పనులపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

– నాగరాజు, పంచాయతీ కార్యదర్శి, బైచిగేరి

70 శాతం పనులు పూర్తి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో తాను సర్పంచ్‌గా గెలిచినప్పటి నుంచి గ్రామంలో 70 శాతం అభివృద్ధి పనులను పూర్తి చేశాం. మరో 30 శాతం పనులు మిగిలి ఉన్నాయి. వాటిని కూడా పూర్తి చేస్తాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి సాధ్యమయ్యింది.

– వడ్డె మహాదేవ, సర్పంచ్, బైచిగేరి

అక్రమ రవాణా కట్టడికి పటిష్ట చర్యలు



మాధవరం చెక్ పోస్టును పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

మంత్రాలయం : ఎన్నికల సమీపిస్తున్నందున ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల వద్ద అక్రమ రవాణా కట్టడికి పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. మంగళవారం సరిహద్దు ప్రాంతమైన మాధవరం చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంతకముందు మంత్రాలయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజనతో కలిసి స్ట్రాంగ్ రూంలు, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. డబ్బు, అక్రమ మద్యం రవాణా జరగకుండా కట్టడి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాసులు, మంత్రాలయం, కోసిగి సీఐలు ఎరిసావలి, ప్రసాద్, ఎస్‌ఐలు ఉన్నారు.



వల్లూరులో రిజిస్ట్రేషన్ పత్రాలతో లబ్ధిదారులు

రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

కౌతాళం: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ పూర్తి చేసి లబ్ధిదారులకు ధ్రువ పత్రాలను అందజేస్తున్నామని గ్రామ ఇన్‌చార్జ్ మరెగౌడ్ తెలిపారు. మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో మంగళవారం పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామానికి 59 మందికి పట్టాలు ఇచ్చిందని, వీరందరి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తచేయడంతో డాక్యుమెంట్లు అందజేశారు. వీఆర్‌ఓ నాగర్జున ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కోసిగి: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ బూత్‌ల్లో అన్ని రకాల వసతులు ఉండేలా చూసుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ విజయ జ్యోతి కుమారి తెలిపారు. మంగళవారం మండలంలోని డి.బెళగల్, కోసిగి రంగప్ప గట్టు పోలింగ్ కేంద్రాలను ఎంఈఓ మొయినుద్దీన్‌తో కలిసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కోసిగి, కౌతాళం, మంత్రాలయం, ఆదోని రూరల్, కర్నూలు రూరల్, తుగ్గలి మండలాల పోలింగ్ కేంద్రాల పర్యవేక్షకురాలిగా తనను నియమించినట్లు చెప్పారు. ఆయా మండలాల్లో 487 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, అందులో కోసిగి మండలంలో 62 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో అన్ని రకాల వసతులు ఉండేలా చూస్తున్నామన్నారు. అనంతరం మంత్రాలయం, కోసిగి కస్తూర్బా పాఠశాలలను సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్షలు బాగా రాయాలని సూచించారు.



కోసిగిలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న విజయజ్యోతి కుమారి

నాడు–నేడు ఏఈ రంగరాజు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ వీరారెడ్డి, వీరస్వామి పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

కౌతాళం: పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ (ఏపీసీ) విజయ జ్యోతి కుమారి అన్నారు. మంగళవారం స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈఓ శోభరాణి, పాఠశాల ప్రత్యేక అధికారిణి పుష్పలత, ఉపాధ్యాయులు ఉన్నారు.

పొత్తు ఫలించేనా?

ఆదోనిటౌన్: సార్వత్రిక ఎన్నికల్లో కలిసికట్టుగా పోటీ చేసేందుకు ప్రతిపక్ష టీడీపీ జనసేన పార్టీతో పొత్తు పెట్టుకుంది. జనసేన–టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేయాలని ఒప్పందం కుదుర్చుకున్నాయి. అయితే ఆదోనిలో ఆ పార్టీల శ్రేణుల మధ్య విభేదాలు బయటపడ్డాయి. టీడీపీ శ్రేణులు పట్టణ కూడళ్లు, ప్రధాన రోడ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అందులో ముద్రించి ఉన్న జనసేన పార్టీ ఆదోని నియోజకవర్గ ఇన్‌చార్జ్ మల్లప్ప ఫొటోపై కనిపించకుండా బ్రౌన్ ప్లాస్టర్ వేశారు. దీంతో ప్రజలు బాబు షూరిటీకి గ్యారంటీ ఏదీ అని ప్రశ్నిస్తున్నారు. జనసేన పార్టీ నేతల ఫొటోలు కనిపించకుండా స్టిక్కర్లు వేయడం, కేవలం టీడీపీ నాయకుల ఫొటోలు మాత్రమే ప్రదర్శించడంతో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



జనసేన ఇన్‌చార్జి మల్లప్ప ఫొటో ఫ్లెక్సీలో కనబడకుండా ప్లాస్టర్ వేసిన దృశ్యం (వృత్తంలో)

తాగునీటి సరఫరా సక్రమంగా జరగాలి

ఆదోనిటౌన్: ఎండాకాలం దృష్ట్యా పట్టణంలో తాగునీటి సరఫరా సక్రమంగా జరగాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి సూచించారు. ఆయన మంగళవారం పీస్ పార్కులోని పంప్ హౌస్‌ను తనిఖీ చేశారు. పంప్ హౌస్‌లో పనిచేస్తున్న వాటర్ వర్క్స్ అధికారులు, లైన్‌మెన్లు, కింది స్థాయి సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది ఉన్నారు, ఎంత మంది గైర్హాజరయ్యారు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతుందా? లేదా? ఏయే వార్డులకు పంపుతున్నారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. పంప్‌హౌస్‌లో ఏపుగా పెరిగిపోయిన ముళ్లపొదల తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. ఎంఈ చలపతిరావు, ఏఈ కృపాకర్ వెంట ఉన్నారు.

జయప్రదం చేయండి

కోసిగి: ఈనెల 9వ తేదీన అమరావతిలో జరగనున్న వికలాంగుల మహాగర్జనను జయప్రదం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా నాయకుడు దుర్గప్ప మాదిగ, తాలుకా నాయకుడు నాగరాజు మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మండల వికలాంగుల సంఘం అధ్యక్షుడు తాయన్న, ఉపాధ్యక్షుడు అనుమంతు ఆధ్వర్యంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. నరసింహులు, రవికుమార్ పాల్గొన్నారు.

డిగ్రీ ఫెయిలైన విద్యార్థులకు మరో అవకాశం

ఆదోని సెంట్రల్: రాయలసీమ విశ్వవిద్యాలయం 2014 విద్యాసంవత్సరం, అంతకుముందు డిగ్రీ ఫెయిలైన విద్యార్థులు పరీక్షలు రాసేందుకు మరో అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులను జారీ చేసిందని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ఓ పత్రిక ప్రకటనలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ గ్రూపులకు సంబంధించి డిగ్రీ సబ్జెక్టులలో ఎవరైనా ఫెయిలై ఉంటే విశ్వవిద్యాలయం ప్రత్యేక సప్లిమెంటరీ పరీక్షలను మే లేదా జూన్ నెలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. హెచ్‌టీటీపీ://ఆర్‌ఎస్‌యూఎడీఎంఐఎస్‌ఎస్‌ఐఓఎన్.కామ్ వెబ్‌సైట్ ద్వా రా ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. ఫీజులను బుధవారం నుంచి స్వీకరిస్తారని తెలిపారు. వివరాలకు కళాశాల ఆఫీసులో సంప్రదించాలని సూచించారు.

మహాశిరాత్రికి ఏర్పాట్లు



డ్రైనేజీలో పూడిక తొలగిస్తున్న కూలీలు

కౌతాళం: మండలంలోని ఎరిగేరి గ్రామంలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేసినట్లు సర్పంచ్ గోవిందు తెలిపారు. గ్రామ శివారల్లో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి ఉత్సవాలు ఈనెల 8వ తేదీన ప్రారంభమై మూడు రోజుల పాటు వైభవంగా జరుగుతాయి. ఇందుకు అనుగుణంగా గ్రామంలో వివిధ పనులను చేయిస్తున్నట్లు చెప్పారు. వీధి దీపాల ఏర్పాటు, డ్రైనేజీలను శుభ్రం చేస్తున్నట్లు వివరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పెద్దకడబూరు : మండలంలోని కంబలదిన్ని గ్రామ శివారులోనున్న మారెమ్మ గుడి వద్ద మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టగా ఎమ్మిగనూరు మండలం మల్కాపురం గ్రామానికి చెందిన మేకల భీమేష్, నరసింహులు అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుబడ్డారని ఎస్‌ఐ మహేష్‌కుమార్ తెలిపారు. మద్యం తరలింపుపై ముందస్తుగా అందిన సమాచారం మేరకు దాడులు చేసినట్లు చెప్పారు. వారిని అదుపులోకి తీసుకొని ఆరు బాక్సుల కర్ణాటక మద్యం, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన

ఆదోనిఅర్బన్: పట్టణంలోని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పోలింగ్ మెటీరియల్ డిస్పాచ్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్, ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మలతో కలిసి పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌లోకి వెళ్లి సౌకర్యాలను, కళాశాల ఆవరణలో కలియతిరిగి పరిశీలించారు. అదేవిధంగా ఎంఐజీ కాలనీలో గతంలో పోలింగ్ శాతం తక్కువగా నమోదైనట్లు తెలుసుకుని నేషనల్ పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం సబ్‌కలెక్టర్, తహసీల్దార్, డీఎస్పీలతో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ శాతం ఎందుకు తక్కువగా ఉందన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల్లో స్ట్రాంగ్ రూమ్ వద్ద ప్రత్యేకంగా షామియానాలు, తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్‌ను ఆదేశించారు. ఎప్పటికప్పుడు విషయాలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. డీఎస్పీ శివనారాయణ స్వామి, తహసీల్దార్ సుల్తానా, వన్‌టౌన్, టూటౌన్ సీఐలు తేజమూర్తి, గోపీ, ఎస్‌ఐలు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోండి



విద్యార్థులు తయారు చేసిన నమూనాను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

కౌతాళం: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని, నిజ జీవితంలో సైన్స్ అవశ్యకత, వినియోగం గురించి తెలుసుకోవాలని ఎరిగేరి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్‌నాయుడు తెలిపారు. మంగళవారం పాఠశాలలో సైన్స్ ఎక్స్‌పో ఏర్పాటు చేశారు. బదినేహాల్, ఉరుకుంద ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు హరినాథ్‌రావు, సునీతదేవి పాల్గొని విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించి అభినందించారు.

ఎల్లమ్మ దేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కోసిగి: స్థానికుల ఇలవేల్పు రేణుక ఎల్లమ్మ దేవికి మంగళవారం అమ్మవారి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు మల్లికార్జున గౌడ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, నూతన వస్త్రాలంకరణ, ఆకుపూజ, మహామంగళ హారుతులు తదితర పూజలు చేపట్టారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులో భాగంగా కుడుములు, గుగ్గిళ్లు నైవేద్యంగా సమర్పించారు. జాతర సందర్భంగా గ్రామంలో మిఠాయిలు, బొమ్మల దుకాణాలు వెలిశాయి.